నియోజకవర్గంలో వేగంగా అభివృద్ధి పనులు

శాలిని దవాఖానలైన్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తదితరులు

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ, అక్టోబర్ 1: ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో అంబర్‌పేట నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుతుగున్నాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. జనాభా అవసరాలకు అనుగుణంగా గత పాలకులు నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలను పట్టించుకోలేక పోవడంతో సమస్య పుట్టు కొస్తున్నాయని పేర్కొన్నారు. కాచిగూడ డివిజన్‌లోని శాలిని దవాఖాన లైన్‌లోరూ.10 లక్షలతో నూతన డ్రైనేజీ పనులు, రాఘవేంద్రస్వామి దేవాలయం సమీపంలోన్‌లో రూ.10 లక్షలతో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం కాచిగూడ కార్పొరేటర్ ఉమ రమేశ్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం డివిజన్‌లోని పలు బస్తీలలో ఎమ్మెల్యే పర్యటించి స్థానికుల నుంచి పలు సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంభంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహకారంతో 4 వేల డబుల్‌బెడ్రూమ్‌లు, గృహలక్ష్మి పథకం కింద 6 వేల మందికి కేటాయించినట్లు పేర్కొన్నారు. గత పాలకుల వల్లే అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ప్రభుత్వ పథకాలను అందించడంలో కిషన్‌రెడ్డి పూర్తి విఫలమయ్యారని ఆరోపించారు. పలు ప్రాంతాల్లో స్థానికులను ప్రధానంగా వేధిస్తున్న నీటి కాలుష్య సమస్య శాశ్వత పరిష్కారంతో పాటు బస్తీ, కాలనీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భావితరాల కోసం నియోజకవర్గంలోని ఐదు డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరిస్తున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, సునీల్‌బిడ్లాన్, కన్నె రమేశ్‌యాదవ్, అధ్యక్షుడు ఎర్ర బీష్మాదేవ్,డాక్టర్ శిరీషాయాదవ్, జలమండలి డీజీఎం ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌యాదవ్, ఓం ప్రకాశ్‌యాదవ్, ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి, బి.కృష్ణా గౌడ్, మహేశ్‌కుమార్, ఎల్.రమేశ్, సుభాష్‌పటేల్, క్షీర్‌సాగర్ బబ్బి, భీంరాజ్, సంతోష్, రవియాదవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా స్వచ్ఛతా హి సేవ

అంబర్‌పేట, అక్టోబర్ 1: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరం స్వచ్ఛతా హి సేవా నిర్వహించి ఆరోగ్యంగా నిలుద్దామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట డివిజన్ వాంబే కాలనీలో నిర్వహించిన డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్మాణ వ్యర్థాల నిర్వహణ(కన్‌స్ట్రక్షన్ వేస్ట్ మేనేజ్‌మెంట్) పై ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి నాంది అని, ప్రజలందరూ తమ ఇళ్లలో తయారయ్యే చెత్తను నిర్లక్ష్యంగా పారేయకుండా చెత్తకుండీలలోనే వేయాలని సూచించారు. నిర్మాణ వ్యర్థాలను తొలగించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని, ఇంటి నిర్మాణం చేసుకునే వారు ఇంటి వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ వారికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ఏఎంఓహెచ్ డా.జ్యోతిబాయి, పారిశుధ్య సిబ్బంది, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, సీనియర్ నాయకులు పి.గెల్వయ్య, మిర్యాల రవీందర్, డి.రాంచందర్, కిషోర్, శ్రీహరి, రమేశ్ ముదిరాజ్, బాలకృష్ణ, బాబు పాల్గొన్నారు.

బాగ్‌అంబర్‌పేట వాంబే కాలనీలో చెత్తను ఎత్తి, అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ పద్మారెడ్డి

శంకరమఠం అమ్మవారికి పూజలు..

నల్లకుంటలోని శ్రీశృంగేరి శంకరమఠాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదివారం సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. మఠంలో ఉన్న గణపతి, ఆది శంకరులు, శారదాంబలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మఠం మేనేజర్ కృష్ణారావు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మఠానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు.

దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

రక్తదానం చేయడం అభినందనీయం ..

తలసేమియా బాధితులకోసం రక్తదానం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నల్లకుంట డివిజన్, విద్యానగర్‌లో అబ్దుల్ కలీం ఖాద్రి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, డిస్ట్రిక్ట్ వైస్ ప్రెసిడెంట్ డా.లక్కరాజు నిర్మల నేతృత్వంలో తలసేమియా బాధితుల కోసం ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సందర్శించి నిర్వాహకులు, రక్తదాతలను సన్మానం చేసి వారి కృషిని కొనియాడారు. అనంతరం సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సేవలు అందిస్తున్న సీనియర్ సిటిజన్స్ డా.లక్కరాజు నిర్మల, రేణుకపతి, రాజ్యం, అనితఖోస్లా తదితరులకు అభినందనలు తెలిపి వారిని సన్మానించారు.

నల్లకుంట దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు..

నల్లకుంట మెయిన్‌రోడ్డులో గల దర్గా హజ్రత్ సయీద్ అలీ ఉల్లాషా దర్గాను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదివారం సందర్శించి ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి, అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్

అంబర్‌పేట, అక్టోబర్ 1 : మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్-ఉన్-నబీ వేడుకలు అంబర్‌పేట నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని ముస్లింలు ర్యాలీ నిర్వహించి పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా బాగ్‌అంబర్‌పేట డివిజన్ తురాబ్‌నగర్, రహత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి డివిజన్ మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి, అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అఫ్రోజ్‌పటేల్, సైఫ్, సోహెల్, జమీల్, హబీబ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ ..

కాచిగూడలో రోడ్డును శుభ్రం చేస్తున్న కాచిగూడ కార్పొరేటర్ ఉమారమేశ్‌యాదవ్ తదితరులు

కాచిగూడ,అక్టోబర్ 1: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు గాంధీ జయంతి పురస్కరించుకుని స్వచ్ఛ తాహి సేవలో భాగంగా కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ ఆదివారం కాచిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, సుభాష్‌పటేల్, కృష్ణకుమార్, క్షీర్‌సాగర్, భీంరాజ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌అంబర్‌పేట ఎస్‌బీఐపార్కులో చెత్తను ఎత్తివేస్తున్న స్థానికులు

అర్చకులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

దేవాదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.బాలాజి

పూజారుల శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడుతున్న దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజి

కాచిగూడ, అక్టోబర్ 1: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ అర్చకులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపాడని దేవాదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.బాలాజీ అన్నారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు దైప, దీప, నైవేద్య అర్చకుల పునఃశ్చరణ శిక్షణ తరగతులను కాచిగూడలోని తుల్జాభవన్‌లో నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు మొత్తం 410 మంది హాజరయ్యారు. తొలిరోజు ఆదివారం ఎ.బాలాజీ హాజరై మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పూజారులకు మరింతగా అవగాహన కల్పించేందుకు ఈ పునఃశ్చరణ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలోని ఆలయాల అర్చలకు రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్లు బి.కృష్ణ, శేఖర్ తమ్మినేని, కాచిగూడలోని తుల్జా భవన్ ఈవో అంజనారెడ్డితో పాటు బాలకృష్ణ, తెలంగాణ జిల్లాలోని పూజారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భగవద్గీత పారాయణం..

ధ్రువపత్రాలను అందజేస్తున్న లయన్ కె.వి. రమణారావు

రవీంద్రభారతి, అక్టోబర్ 1: గురవారయప్పన్ సత్సంగ్ ఆధ్వర్యంలో సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా ఆదివారం నగరంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో 400 మంది భగవద్గీత పాఠకులతో భగవద్గీత శ్లోక పారాయణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారత వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు లయన్ కె.వి రమణారావు విచ్చేసి మాట్లాడుతూ.. అద్భుతమైన భారతీయ సనాతన ధర్మ ప్రచారం చేసేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ భక్తి, సనాతన ధర్మం వైపు ఆకర్షించేలా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశీస్సులతో స్వామి వారి వద్ద శిక్షణ పొందిన 400 మంది, భగత్‌గీతలోని 700 శ్లోకాలను 100 నిమిషాల పాటు పఠించి, భారత వరల్డ్ రికార్డ్స్, కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు. అట్టి నమోదు ధ్రువపత్రాలను గురువాయరప్పన్ సత్సంగ్ హైదరాబాద్ సభ్యురాలు సారికకు అందజేసి అభినందించారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న 400మంది పాఠకులకు నమోదు ధ్రువపత్రాలను కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కో-ఆర్డినేటర్ కల్పనా దత్త సమక్షంలో అందజేశారు. దైవజ్ఞశర్మ, సారిక, ఛాయ, లావణ్య, సుభద్ర, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ,అక్టోబర్ 1: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(40)ఆదివారం కాచిగూడ-మలక్‌పేట రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా అదే సమయంలో గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటననా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై నలుపు రంగు చొక్క, బూడిద రంగు ప్యాంట్ ధరించి. ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాల కోసం 9948695948లో సంప్రదించాలని హెచ్‌సీ సమ్మయ్య కోరారు.